

సిపిఎస్ ఉద్యోగుల ధర్నాకు సిఐటియు మద్దతు

ప్రజాశక్తి-కాకినాడ


ఓల్డ్ పెన్షన్ స్కీమ్‌ను పునరుద్ధరించాలని 8న సిపిఎస్ ఉద్యోగులు రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్ల వద్ద నిర్వహించే ధర్నాలకు మద్దతు తెలుపుతున్నట్లు సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దువ్వా శేషుబాబ్జీ, చెక్కల రాజ్‌కుమార్ శుక్రవారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వ శాఖలు, సంస్థల్లో సిఐటియు అనుబంధ సంఘాల సభ్యులంతా ధర్నాలకు మద్దతు తెలపాలని పిలుపునిచ్చారు. వారంలో సిపిఎస్‌ను రద్దు చేస్తానన్న రాష్ట్ర ప్రభుత్వం నాలుగేళ్ళు గడుస్తున్నా సిపిఎస్‌ను రద్దు చెయ్యలేదన్నారు. ఓల్డ్ పెన్షన్ స్కీంను పునరుద్ధరించకుండా సిపిఎస్ ఉద్యోగులకు నష్టం కలిగించేలా జిపిఎస్‌ను ప్రతిపాదించడం అన్యాయమన్నారు. ఇచ్చిన హామీ ప్రకారం వెంటనే సిపిఎస్ రద్దుచేయాలని, ఓపిఎస్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

సమస్యల సుడిలో క్లాప్ డ్రైవర్లు

- అందని కనీస వేతనాలు
- ఆరోగ్య సౌకర్యాలు కరువు
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

నగరపాలక సంస్థ పరిధిలో ప్రజారోగ్యాన్ని కాపాడే విషయంలో కీలక భూమిక పోషిస్తూ వారి ఆరోగ్యాలను పణంగా పెడుతూ సేవలు అందిస్తున్న క్లీన్ ఆంధ్రప్రదేశ్ (క్లాప్) డ్రైవర్లకు కనీస వేతనాలు కరువయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛ్ సంకల్ప్‌లో భాగంగా నియామకాలు చేపట్టిన క్లాప్ వెహికల్ డ్రైవర్ల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం, అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. కాకినాడ కార్పొరేషన్ పరిధిలో 105 మంది క్లాప్ డ్రైవర్లు పని చేస్తున్నారు. వీరంతా రోజులో 10 నుంచి 12 గంటల పాటు కష్టపడుతూ ఇంటింటికి వెళ్లి తడి, పొడి చెత్త సేకరణలో పాల్గొంటున్నారు. నగరపాలక సంస్థ అధికారులు అప్పగించిన పనిని తుచ తప్పకుండా అమలు పరుస్తున్నారు. అయితే వారికి జిఒ ప్రకారం వీరికి కనీస జీతాలు ఇవ్వడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం డ్రైవర్లకు రూ.12,500 చెల్లిస్తోంది. ఇందులో వివిధ కటింగ్‌లు పోగా రూ.10 వేలు మాత్రమే మిగులుతుంది. ప్రస్తుతం నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో సామాన్య కుటుంబానికి సైతం రూ.20 వేల ఆదాయం ఉంటేనే గాని గడవని పరిస్థితి నెలకొంది. రూ.10 వేలతో కుటుంబ పోషణ, పిల్లల చదువులు, ఇంటి ఖర్చులు, పెట్రోలు, గ్యాస్, ఇటీవల పెరిగిన విద్యుత్ ఛార్జీల భారం మోయలేకుండా ఉన్నామని డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిఒ 7 ప్రకారం రూ.18,500 వేతనాలు చెల్లించాలని కోరుతున్నారు. వారాంతపు సెలవులు లేకపోవడంతో విశ్రాంతి తీసుకునే అవకాశం కూడా ఉండడం లేదని వాపోతున్నారు. ఒక వేళ జీతం కట్ చేసి సెలవు ఇవ్వాలని కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదంటూ తెలిపారు. అనారోగ్యం చేసినా, అత్యవసర పనులు వచ్చినా సెలవులు లభ్యం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సొంత పనులు చేసుకోవడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చెప్పారు. ఇప్పుడిప్పుడే సౌకర్యం కల్పించకపోవడంతో భవిష్యత్తుపై బెంగ వెంటాడుతుందని తెలిపారు. ఇఎస్ఐ సౌకర్యం లేక ఆరోగ్య సమస్యలు వస్తే ప్రైవేటు ఆసుపత్రుల్లో ఫీజులు చెల్లించలేక, మందుల ఖర్చులు భరించలేక అప్పుల పాలవుతున్నట్లు తెలిపారు. పిఎఫ్ కూడా లేక తీవ్రస్థాయిలో ఇబ్బందులకు గురవుతున్నారు.


ఆందోళన చేస్తున్న క్లాప్ డ్రైవర్స్ (ఫైల్)

కొన్ని సందర్భాల్లో అధికారులు తీవ్ర వేధింపులకు గురి చేస్తున్నారు. కాంట్రాక్ట్ దోపిడీ వ్యవస్థ లేకుండా ఆప్కాస్‌ను తెచ్చిన ప్రభుత్వం జిఒ 136 తెచ్చారు. మరలా క్లాప్ డ్రైవర్ల వ్యవస్థలో కాంట్రాక్టర్‌ను పెట్టడం సమంజసంగా లేదని సిఐటియు నాయకులు పేర్కొన్నారు. కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెంచాలని ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా వాయిదాలు వేస్తూ వస్తున్నారని చెప్పారు. డ్రైవర్ల పట్ల బెదిరింపులు, వేధింపులు ఎక్కువవుతున్నాయన్నారు. కార్మికుల జీతాల నుంచి పిఎఫ్, ఇఎస్ఐ కాంట్రాక్టర్ కోత పెడుతూ ఆయా సంస్థలకు జమ చేయడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, మున్సిపల్ శాఖ బాధ్యత తీసుకుని యూనియన్ నాయకులతో చర్చించి తమ సమస్యలు పరిష్కరించాలని డ్రైవర్లు డిమాండ్ చేస్తున్నారు. లేకుంటే ఆందోళన ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు.

దశలవారీగా ఆందోళనకు సిద్ధం



క్లాప్ డ్రైవర్ల సమస్యలను తక్షణమే పరిష్కరించే విధంగా మున్సిపల్ అధికారులు స్పందించాలి. జిఒ ప్రకారం జీతాలు చెల్లించాలి. కార్మిక చట్టాలను అమలు చేయాలి. ప్రిన్సిపల్ ఎంప్లాయిర్ ఉన్న నగరపాలక సంస్థ కమిషనర్ చొరవ తీసుకుని డ్రైవర్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి. ప్రతి నెల 5వ తేదీలోపు జీతాలు చెల్లించాలి. లేకుంటే దశల వారీగా ఆందోళనకు సిద్ధం అవుతున్నాం.

- పలివెల వీరబాబు, సిఐటియు నగర అధ్యక్షుడు.

రుణాల మంజూరు వేగవంతానికి ఆదేశం

ప్రజాశక్తి-కాకినాడ

ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనందున సిసిఆర్‌సి కౌలు కార్డులున్న వారికి రుణాల మంజూరు ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా బ్యాంకు అధికారులను ఆదేశించారు. శుక్రవారం కాకినాడ కలెక్టరేట్ వివేకానంద హాల్లో కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, ఎల్‌డిఎం సిహెచ్.ఎస్‌వి.ప్రసాద్‌తో కలిసి వివిధ బ్యాంకుల కంట్రోలర్లు, వ్యవసాయ, పశుసంవర్ధక, గ్రామీణాభివృద్ధి తదితర శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ కాకినాడ జిల్లాలో 30 వేల పంట సాగుదారు హక్కు కార్డులు (సిసిఆర్‌సి) జారీ అయ్యాయని ఈ కార్డుదారులకు రుణాలు వీలైనంత త్వరగా అందించాలన్నారు. వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో బ్యాంకు బ్రాంచ్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ రుణాలు సత్వరం అందేలా చూడాలన్నారు. కిసాన్ క్రెడిట్ కార్డులు (పశు సంవర్ధక) ఉన్నవారికి రుణాలు మంజూరు చేసేందుకు ప్రత్యేక శిబిరాల ద్వారా దరఖాస్తులు స్వీకరించినట్టు చెప్పారు. జిల్లాలోని 414 రైతు భరోసా కేంద్రాల్లో బిజినెస్ కరస్పాండెంట్ల ద్వారా రైతులకు సేవలందేలా చూడాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఎపి అమూల్ ప్రాజెక్టు-జగనన్న పాల వెల్లువ కార్యక్రమం త్వరలోనే కాకినాడ


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కృతికా శుక్లా

జిల్లాలో ప్రారంభం కానున్నందున ఈ ప్రాజెక్టు విజయవంతం కావడానికి బ్యాంకులు తోడ్పాటు అందించాలన్నారు. 200 గ్రామాల్లో కార్యక్రమం అమలు కానుందని ఈ నేపథ్యంలో పాడిపశువుల యూనిట్లను కూడా గ్రౌండింగ్ చేయాలని నిర్ణయించినందున పిఎంఇజిపి ద్వారా రుణాలు మంజూరుకు బ్యాంకులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కృతికా శుక్లా అన్నారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి ఎన్.విజయకుమార్, పశుసంవర్ధక అధికారి డాక్టర్ ఎస్.సూర్యప్రకాష్‌రావు, డిఐసి జిఎం టి.మురళి, డిఆర్‌డిఎ పీడీ కె.శ్రీరమణి హాజరయ్యారు.

ఎస్‌సి, ఎస్‌టిలపై తగ్గిన దాడులు : ఆర్‌డిఒ

ప్రజాశక్తి-కాకినాడ

సామాజికంగా పెరిగిన సామరస్య భావన, చట్టాల పట్ల పెంపొందిన అవగాహన ద్వారా డివిజన్‌లో ఎస్‌సి, ఎస్‌టిలపై దాడులు, దురాగతాల కేసులు గణనీయంగా తగ్గాయని కాకినాడ ఆర్‌డిఒ ఎన్‌వివి.సత్యన్నారాయణ తెలిపారు. శుక్రవారం స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో డివిజన్ స్థాయి ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సమావేశంలో ఆర్‌డిఒ మాట్లాడారు. రెవెన్యూ, పోలీస్ అధికారుల మధ్య సమన్వయం, డివిజన్, జిల్లా విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సభ్యుల చైతన్యవంతమైన పాత్రల కారణంగా కాకినాడ డివిజన్ పరిధిలో ఎస్‌సి, ఎస్‌టిలపై దాడులు గణనీంగా తగ్గాయన్నారు. ఇదే స్ఫూర్తిని కొనసాగించి కాకినాడ డివిజన్‌ను జిల్లాలోను, రాష్ట్రంలోను ఆదర్శవంతగా నిలబెడదామని ఆయన సభ్యులు, అధికారులకు ఆయన పిలుపు ఇచ్చారు. కాకినాడ డివిజన్ పరిధిలో ఈ సంవత్సరం ఇప్పటి వరకూ 13 అట్రాసిటీ కేసులు నమోదయ్యాయని, ఈ కేసుల్లో బాధితులకు ఎఫ్ఐఆర్ నమోదైన వెంటనే రూ.3.50 లక్షల సహాయాన్ని అదించేవారన్నారు. అనంతరం గత సమావేశంలో సభ్యులు సూచించిన అంశాలపై రెవెన్యూ, పోలీస్, వెల్ఫేర్ శాఖలు చేపట్టిన చర్యలను ఆయన సభ్యులకు వివరించారు. దాడులు జరిగితే ఆదుకోవడం కన్నా


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డిఒ

అసలు దాడులే జరగకుండా నివారించే ముందస్తు సంసిద్ధత మెరుగైన విధానమని సభ్యులు అన్నారు. పారిశుధ్య కార్మికులకు గ్రామ పంచాయితీల్లో చెల్లించే వేతనాలు ఒక్కో గ్రామంలో ఒకలా ఉంటున్నాయని, అందరికీ సమానమైన వేతనాలు చెల్లించాలని కోరారు. ఈ సమావేశంలో కాకినాడ డిఎస్‌పి కె.మురళీకృష్ణారెడ్డి, విజిలెన్స్ కమిటీ సభ్యులు డాక్టర్ మోకా పవన్ కుమార్, డోకుబర్ర భద్రం, బండి వీరలింగేశ్వరరావు, పిల్లి జ్యోతి, గంగవశం త్రినాథ్ దేవ్, సాపే సుధాకర్, బొంగారి బాలభద్రరావు, ఏసుబాబు, జిజిహెచ్ వైద్యాధికారి డాక్టర్ సిహెచ్.పుష్కరరావు పాల్గొన్నారు.

ఉత్సాహంగా టిడిపి చైతన్య యాత్ర

ప్రజాశక్తి-కాకినాడ కార్పొరేషన్

కాకినాడలో టిడిపి చైతన్య రథయాత్ర శుక్రవారం ఉత్సాహంగా నిర్వహించారు. కాకినాడ సిటీ టిడిపి ఇన్‌ఛార్జి, మాజీ ఎంఎల్‌ఎ వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు) ఆధ్వర్యంలో కమాండ్ కమ్యూనికేషన్ సెంటర్, గోదావరి కళాక్షేత్రం, సైన్స్ సెంటర్, సంజయ్ నగర్ డంపింగ్ యార్డ్, పర్లోపేట టిడ్కో గృహాలు, దుమ్ములపేట స్థలాల మీదుగా యాత్ర సాగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకష్ణుడు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వైసిపి పాలనలో ధ్వంసమైన రాష్ట్రాన్ని రక్షించుకోవలసిన బాధ్యత అందరి పైనా ఉందన్నారు. సంక్షేమ పథకాలకు దేశంలో శ్రీకారం చుట్టిందే తెలుగుదేశం పార్టీ అని స్పష్టం చేశారు. నాడు ఎన్టీఆర్ తిండి, బట్ట, ఇల్లు ప్రతి పేదవాడి సంక్షేమానికి శ్రీకారం చుట్టారని ఆయన. సంక్షేమనికి కేరాఫ్ అడ్రస్ టిడిపి అన్నారు. ఆ తరువాత చంద్రబాబు ప్రతి పేదవాడూ ఆనందంగా జీవించాలనే లక్ష్యంతో మరిన్ని సంక్షేమ పథకాలు సష్టించారని తెలిపారు. ఎన్టీఆర్ ఆశయాలకు అనుగుణంగానే మహిళలు, యువత, రైతులు, బలహీన వర్గాలను దష్టిలో పెట్టుకుని పార్టీ మినీ మేనిఫెస్టో విడుదల చేశామని చెప్పారు.

జెఎన్‌టియుకెలో మెగా జాబ్ మేళా

ప్రజాశక్తి-కాకినాడ

చలమలశెట్టి సునీల్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జెఎన్‌టియుకె ప్రాంగణంలో రెండు రోజుల పాటు నిర్వహించే మెగా జాబ్ మేళాను శుక్రవారం విసి ప్రొఫెసర్ జివిఆర్.ప్రసాదరాజు ప్రారంభించారు. ఐఐఐపి అండ్ టి డైరెక్టర్ ప్రొఫెసర్ జి.యేసురత్నం, యుసిఇకె ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎంహెచ్.ఎం.కష్ణప్రసాద్, యుసిఇకె ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ డాక్టర్ ఎ.కరుణల పర్యవేక్షణలో మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా విసి ప్రసాదరాజు మాట్లాడుతూ 70 ప్రతిష్టాత్మకమైన కంపెనీలకు సంబంధించి మూడు వేల మందికి పైబడి ఉద్యోగావకాశాల కోసం నిర్వహిస్తున్న ఈ మెగా జాబ్ మేళాను యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ జాబ్ మేళాకు సుమారుగా 13 వేల మంది అభ్యర్థులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని ఆయన తెలిపారు. చలమలశెట్టి సునీల్ చేపడుతున్న సామాజిక, సేవా కార్యక్రమాలు అభినందనీయమని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో


జాబ్ మేళాను ప్రారంభిస్తున్న విసి ప్రసాదరాజు

రిజిస్ట్రార్ ఎల్.సుమలత, ఒఎస్‌డి డి.కోటేశ్వరరావు, డిఎపి కెవిఎ.మురళీకృష్ణ, వి.రవీంద్ర, చీఫ్ ఇంజనీర్ వి.శ్రీనివాసులు, పి.సుబ్బారావు, ఎస్‌ఎంఎస్ డైరెక్టర్ ఎ.కష్ణమోహన్, యూనివర్శిటీ స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ జి.శ్యామ్‌కుమార్, చలమలశెట్టి సునీల్ ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ రెడ్డం దుర్గాప్రసాద్, ట్రస్ట్ ప్రతినిధులు, అధ్యాపకులు, హెస్‌ఆర్ మేనేజర్లు, వాలంటీర్లు పాల్గొన్నారు.

సీజన్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

వర్షాకాలంలో బ్యాక్టీరియా అధికంగా ఉండడం వల్ల జలుబు, ఫ్లూ, వైరస్ జ్వరాలు వచ్చే అవకాశం ఉన్నందున తగు జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ జి.లక్ష్మణ ప్రసాద్ పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్‌లో బోట్ క్లబ్ వాకర్స్ ఆధ్వర్యంలో జరిగిన ఆరోగ్య అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇంట్లో దుమ్మూ, ధూళీ లేకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఇంటి పరిసరాల్లో నీరు నిలవ లేకుండా చూడాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని అధికంగా తీసుకోవాలన్నారు. ఆహార విషయంలో కూడా జాగ్రత్తలు పాటించకపోతే జీర్ణ సమస్యలు వచ్చే అవకాశం ఉందన్నారు. బయట ఆహార పదార్థాలపై ఈగలు వాలడం వల్ల బ్యాక్టీరియా ఎక్కువగా ఉంటుంది కాబట్టి సాధ్యమైనంత వరకు ఇంట్లో తయారు చేసిన పదార్థాలను తీసుకోవాలని డాక్టర్ లక్ష్మణ ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, బుద్ధరాజు సత్యనారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు.

చిగుళ్ల వ్యాధిపై అశ్రద్ధ తగదు

ప్రజాశక్తి-కాకినాడ రూరల్


చిగుళ్ల వ్యాధి ప్రారంభంలో ప్రభావం చూపకపోయినా క్రమేపీ వ్యాధి తీవ్రత పెరిగేకొద్దీ ఇబ్బందులు ఎదురవుతాయని డాక్టర్ సువర్ణ రాజు పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్‌లో బోట్ క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఆరోగ్య అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వ్యాధి ముదిరితే చిగుళ్లలో వాపులు వచ్చి రక్తం, చీము కారడం, పంటికి మధ్య ఖాళీలు ఏర్పడతాయన్నారు. చివరకు పళ్లు ఊడిపోయే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా పిల్లలు తీపి పదార్థాలు తీసుకున్నప్పుడు నోటిని శుభ్రపరచాలని అన్నారు. రోజు ఉదయం రాత్రి పడుకోబోయే ముందు దంతాలను శుభపరచుకోవాలని డాక్టర్ సువర్ణ రాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, రాఘవరావు పాల్గొన్నారు.

విద్యకు వైసిపి ప్రభుత్వం పెద్దపీట

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్, కరప

రాష్ట్రంలో గతంలో ఎన్నడూ లేని విధంగా విద్యకు వైసిపి ప్రభుత్వం, సిఎం జగన్ అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. ఉండూరు జెడ్‌పి ఉన్నత పాఠశాలలో అమ్మఒడి పథకం పంపిణీ కార్యక్రమంలో దొరబాబు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అమ్మఒడి పథకం ద్వారా తల్లుల ఖాతాల్లో నేరుగా డబ్బులు వేశారన్నారు. దానిద్వారా పిల్లల చదువు తల్లిదండ్రులకు భారం కాకూడదని తలుస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు, గ్రామ సర్పంచ్ ధనలక్ష్మి, ఉపసర్పంచి కొప్పిరెడ్డి రాధాకృష్ణ, వైసిపి మండల అధ్యక్షుడు తాటికొండ బాబ్జి, వైసిపి నాయకుడు ఎలిశెట్టి నరేష్, ఎంఇఒలు శివరామకృష్ణయ్య, పుల్లయ్య హెచ్‌ఎం యామినా మాధురి పాల్గొన్నారు.

కరప మండలానికి అమ్మఒడి నిధులు మంజూరయ్యాయని ఎంఇఒ కృష్ణవేణి తెలిపారు. స్థానిక చిరంజీవి కళ్యాణ మండపంలో తల్లుల కమిటీతో నిర్వహించిన సమావేశంలో ఎంపిపి పెంకే శ్రీలక్ష్మి సత్తిబాబు, జెడ్‌పిటిసి వై.సుబ్బారావు పాల్గొని ప్రసంగించారు.


కరపలో చెక్కు అందిస్తున్న నాయకులు

సుబ్బా రావు మాట్లాడుతూ విద్యా విధానంలో సిఎం వైయస్ జగన్మోహన్ రెడ్డి, నాడు-నేడు ద్వారా నిధులు మంజూరు చేసి స్కూల్ అభివద్ధికి మొదట ప్రాధాన్యత ఇచ్చారని సుబ్బారావు తెలిపారు. గ్రామ సర్పంచ్ సాగే ఆశాజ్యోతి కుమార్, ప్రధానోపాధ్యాయులు లీల మనోహర్, విద్యా కమిటీ ఛైర్మన్ రమాదేవి, వైస్ సర్పంచ్ సూర్యనారాయణ, రాయుడు శ్రీను పాల్గొన్నారు.

లాకులు తొలగిస్తే క్రాప్ హాలిడే తప్పదు

ప్రజాశక్తి-పిఠాపురం

గోకివాడ గ్రామంలో అక్కినీడి చెరువుకు నీరు వెళ్లే లాకులు తొలగిస్తే క్రాప్ హాలిడే ప్రకటిస్తామని గ్రామంలోని రైతులు అధికారులను హెచ్చరించారు. శుక్రవారం క్రాప్ హాలిడే ఫ్లెక్సీతో మదుమ్ డ్యామ్ వద్ద రైతులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ గ్రామంలోని అక్కినీడి వారు చెరువు కింద సుమారు 500 ఎకరాల సాగు భూమికి నీరు పుట్టకొండ కాలువ ద్వారా వస్తుందన్నారు. చెరువు నిండిన తర్వాత రాపర్తి గ్రామ రైతులకు సాగు నీరు వెళుతుందన్నారు. రాపర్తి రైతుల రాజకీయ ఒత్తిళ్లతో చెరువు లాకులు తొలిగించే ప్రయత్నాలు చేస్తున్నారని అదే జరిగితే తమ గ్రామంలో పంట పొలాలకు సాగు నీరు అందన్నారు. తమ గ్రామంలో చెరువు రెండు రోజుల్లో నిండిపోతుందని, తర్వాత నీరు రాపర్తి గ్రామానికి వెళుతుందని చెప్పారు. లాకులు తొలగిస్తే గోకివాడ పంటపొలాలకు చుక్క సాగు నీరు ఉండదని అంతా కిందకు పోతుందని ఆవేదన వ్యక్తం


ఆందోళన చేస్తున్న గోకివాడ గ్రామ రైతులు

చేశారు. ఈ ఆందోళనలో సర్పంచ్ కీర్తి హరినాధ బాబు, ఎంపిటిసి వేమగిరి చిన్న నాగరాజు, రైతులు డి.వెంకటరావు, ఎన్.నానాజీ, ఎన్.సూరిబాబు, ఎ.దొరబాబు, చిట్టిబాబు, కె.వెంకటరావు, గుర్రాజు, కె రాంబాబు తదితరులు పాల్గున్నారు.

సమస్యలపై కమిషనర్‌కు క్లాప్ డ్రైవర్స్ వినతి

ప్రజాశక్తి-కాకినాడ

నగర పాలక సంస్థ పరిధిలో పనిచేస్తున్న క్లీన్ ఆంధ్రప్రదేశ్ (క్లాప్) వాహన డ్రైవర్స్ సమస్యలపై కమిషనర్ రావిరాల మహేష్ కుమార్ సానుకూలంగా స్పందించడం పట్ల క్లాప్ డ్రైవర్స్ సంతోషం వ్యక్తం చేశారు. శుక్రవారం సిఐటియు ఆధ్వర్యంలో క్లాప్ డ్రైవర్స్ సమస్యలపై కమిషనర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సిఐటియు నగర అధ్యక్షుడు పలివెల వీరబాబు, యూనియన్ అధ్యక్షుడు ఎం.శివ శంకర్ మాట్లాడారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, వైజాగ్ తరహాలో రూ.18,500 జీతం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని కోరారు. వారాంతపు సెలవులు, మెడికల్ లీవులు, పిఎఫ్ ఇఎస్ఐ, వాహనాల యార్డులో సౌకర్యాలు గురించి కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై కమిషనర్ స్పందిస్తూ ఏజెన్సీ ద్వారా కొన్ని జరగాలని, వారాంతపు సెలవులు గురించి ఇతర అధికారులతో మాట్లాడి అమలు చేయిస్తానని తెలిపారు. వర్షాకాలం సందర్భంగా వర్కర్స్‌కు ఇచ్చినట్లే తమకు రెయిన్ కోట్స్ ఇవ్వాలని కోరగా తప్పకుండా ఏర్పాటు చేస్తామన్నారు. కమిషనర్ స్పందన పట్ల క్లాప్ డ్రైవర్స్ సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర అధ్యక్షుడు పలివెల వీరబాబు, యూనియన్ అధ్యక్షుడు ఎం.శివశంకర్, ఎస్.అభి, ఎన్.గంగాధర్, టి.సూరిబాబు, టి.శ్రీనివాస్, టి.గంగాధర్, ఎం.పెదఅప్పన్న, ఎన్.సూరిబాబు, నాని బాబు, భైరవస్వామి, ఇస్మాయిల్, సంతోష్, కొండబాబు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



రెంట్ కంటే కరెంటు బిల్లే ఎక్కువ అయిపోయిందరా బాబూ..!!

అర్హులందరికీ సంక్షేమ పథకాలే లక్ష్యం

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలన్న లక్ష్యంతోనే ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని పలువురు ప్రజాప్రతినిధులు అన్నారు. శుక్రవారం జిల్లాలోని పలుచోట్ల కార్యక్రమాలు నిర్వహించారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

తుని కొత్త సూరవరంలో మంత్రి దాడిశెట్టి రాజా జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికలు దగ్గర పడడంతో యనమల రామకష్ణుడు ఓట్ల కోసం మోకాళ్ళ మీద నడుస్తూ ఓట్లు అడుగుతున్నారని, తన కుమార్తె దివ్యని ఎలాగైనా గెలిపించాలని అష్ట కష్టాలు పడుతున్నారని అన్నారు. ప్రజలు యనమల కుటుంబాన్ని నమ్మే పరిస్థితిలో లేరన్నారు. గ్రామంలో రూ.43 కోట్లతో అభివృద్ధి పనులు చేసినట్టు తెలిపారు. అనంతరం అర్హులైన వారికి సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి సోడిసెట్టి సత్య నాగేశ్వరరావు, పోతల రమణ, పోతల లక్ష్మణ్, సక్కుల నాగేంద్ర నెహ్రూ, కసనం దొరబాబు, గారా శ్రీను, నట్ల చక్రరావు, కీర్తి రాఘవ, వంగలపూడి అప్పారావు పాల్గొన్నారు. **సామర్లకోట రూరల్** అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలన్న లక్ష్యంతోనే ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఉద్యమంగా నిర్వహిస్తోందని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ దవులూరి దొరబాబు, మున్సిపల్ ఛైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ కృష్ణమూర్తి అన్నారు. జి.మేడపాడులో ఎంపిడిఒ శ్రీలలిత అధ్యక్షతన, సామర్లకోట బ్రౌన్‌పేట సచివాలయం వద్ద మున్సిపల్ కమిషనర్ జె.రామారావు అధ్యక్షతన జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమాల్లో వారు పాల్గొన్నారు. అనంతరం లబ్ధిదారులకు సర్టిఫికెట్లు ఇచ్చారు. ఈ కార్యక్రమాల్లో ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు, వైసిపి పంచాయితీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు మోరంపూడి రంగ, సర్పంచ్ పటాని దేవి, మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ మోరంపూడి రమేష్, వార్డు సభ్యులు, ఎంపిటీసీ సభ్యులు, మున్సిపల్ వైస్ ఛైర్మన్ ఊబా జాన్ మోజెస్, కౌన్సిలర్‌లు పిట్టా సత్యనారాయణ, నాయకులు ఇరుసుమళ్ళ సాయి, వారా సుధాకర్, వలంటీర్లు పాల్గొన్నారు. **జగ్గంపేట రూరల్** రాజపూడి సచివాలయం 2 వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఎంఎల్‌ఎ జ్యోతుల చంటి బాబు మాట్లాడారు. ఎంపిడిఒ వసంత్ కుమార్, సర్పంచ్ బూసాల విష్ణుమూర్తి, ఎంపిపి అత్తులూరి నాగబాబు, ఎంపిటిసి నంగన నాని, దేవర రాజు పాల్గొన్నారు. **తాళ్లరేవు** నీలపల్లి పంచాయతీలో సర్పంచ్ చిట్టూరి నాగమణి అధ్యక్షతన జరిగిన సభలో ఎంపిపి రాయుడు సునీత ప్రత్యేకాధికారి లక్ష్మీనరసయ్య మాట్లాడారు. సభలో 1100


తాళ్లరేవులో సర్టిఫికెట్లు అందిస్తున్న ఎంపిపి, ప్రత్యేకాధికారి లక్ష్మీనరసయ్య

దరఖాస్తులు వచ్చినట్లు ఎంపిడిఒ ఎం.అనుపమ తెలిపారు. నీలపల్లిలో డ్రైనేజీలు నిర్మించాలని, తాగునీరు పూర్తిస్థాయిలో అందించాలని ప్రజలు అధికారులు దష్టికి తీసుకువచ్చారు. మేజర్ సమస్యలను ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్ దష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని ఎంపిపి ప్రజలకు తెలిపారు. ఈ కార్యక్రమంలో చిట్టూరి కలికి మూర్తి, రెడ్డి సతీష్, రేవు మల్లీశ్వరి, మోకా మధు, ఎంపిటిసి దంగేటి సూరిబాబు, సచివాలయాల మండల కన్వీనర్ దున్న శ్రీకాంత్, రాయుడు గంగాధర్, కట్టా దుర్గారావు, గునిపే విష్ణు, కొండ, కార్యదర్శి వరలక్ష్మి పాల్గొన్నారు.

నైపుణ్యాలను మెరుగు పర్చుకోవాలి

కాకినాడ : విద్యార్థులు ఆధునిక సాంకేతికతతో కూడిన నైపుణ్యాలను మెరుగు పర్చుకోవాలని జెఎన్‌టియుకె విసి ప్రొఫెసర్ జివిఆర్.ప్రసాదరాజు సూచించారు. జెఎన్‌టియుకె పలు విభాగాలు, ఇన్ఫోసిస్ కంపెనీ సహకారంతో ఇంజనీరింగ్ విద్యార్థులకు నిర్వహిస్తున్న స్టూడెంట్ ఎనేబిల్మెంట్ ప్రోగ్రామ్ శుక్రవారంతో ముగిసింది. ఈ కార్యక్రమంలో విసి జివిఆర్.ప్రసాదరాజు మాట్లాడారు. అంతర్జాతీయ స్థాయిలో ఒబామా సింగ్ పార్టనర్షిప్-20220 ప్రోగ్రామ్, విద్యార్థులకు ఉపయోగపడే ప్రాజెక్టను జెఎన్‌టియుకె యూనివర్శిటీకి తీసుకువస్తున్న ఇంక్యుబేషన్ సెంటర్ అడ్వయిజర్ ప్రొఫెసర్ జెవిఆర్.మూర్తిను ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులు తాము అనుకున్న లక్ష్యాలను సాధించేందుకు నిరంతరం శ్రమించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. విద్యార్థులకు ముఖ్యంగా ఉద్యోగ నైపుణ్యాలు అభివద్ధి చెందుతాయని, మంచి ఆధునిక సాంకేతికతకు కంపెనీల్లో అధిక వేతనంతో అవకాశాలు లభిస్తాయన్నారు.

విద్య ద్వారా బాలికలకు మనోధైర్యం

కాకినాడ రూరల్ : ఆడపిల్లలు చదువుకోవడం వల్ల సమాజాన్ని అర్థం చేసుకుంటూ సమస్యలపై ధైర్యంగా పోరాడతారని న్యాయవాది పెండెం శ్రీదేవి పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్‌లో బోట్ క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఆడపిల్లలను చదివించడం ఎంతో అవసరమన్నారు. ఇంటి పనుల్లో సాయం చేస్తారనో, చదివిస్తే అంతకన్నా ఎక్కువ చదువుకున్న వరుడిని ఇచ్చి పెళ్లి చేయాలనో, ఎంత చదివినా ఏదో ఒక రోజు పెళ్లి చేసి అత్తారింటికి పంపడమే కదా అనే భావంతో చదివించకపోవడం తగదన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

నేరాలు ఘోరాలు

బిడ్డతో వివాహిత అదృశ్యం

ప్రజాశక్తి - ఆలమూరు

నాలుగేళ్ల బిడ్డతో ఒక బట్టీలో పని చేస్తున్న వివాహిత అదృశ్యమైనట్లు ఆమె భర్త ఫిర్యాదుపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. ఎస్ఐ ఎస్.శివప్రసాద్ తెలిపిన వివరాలు ప్రకారం మండలంలోని జొన్నాడలో జగన్నాథరెడ్డి ఇటుకుల బట్టీలో పని చేస్తున్న జన్ని స్వర్ణకుమారి, తన కుమార్తె వైష్ణవితో జూన్ 30న అదశ్యమయ్యింది. అప్పటి నుంచి ఆమె ఆచూకీ తెలియకపోవడంతో భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివప్రసాద్ తెలిపారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

ప్రజాశక్తి-మండపేట

అదనపు కట్నం కోసం అత్తింటి వారు వేధిస్తున్నారంటూ స్థానిక కొండపల్లి వారి వీధికి చెందిన గుంటముక్కల జ్యోతిప్రియ శుక్రవారం పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. 16 ఏళ్ల క్రితం రాజ్ కుమార్‌తో ప్రేమ వివాహం అవగా వివాహ సమయంలో కట్నకానుకలు ఇచ్చామని, అనంతరం అదనపు కట్నం తీసుకురావాలని భర్త, అత్త శ్రీదేవి తనను శారీరకంగా, మానసికంగా హింసిస్తున్నారని పట్టణ పోలీస్ స్టేషన్లో ప్రియ ఫిర్యాదు చేశారు. ఎస్ఐ కోన అప్పారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దాడి చేశారని సర్పంచ్ ఫిర్యాదు

ప్రజాశక్తి-రౌతులపూడి

మండలంలోని రాఘవపట్నం పంచాయతీలో రైతు భరోసా కేంద్రం వద్ద నిర్మించ తలపెట్టిన బిఎస్ఎన్ఎల్ టవర్ నిర్మాణ విషయమై వైసిపి నాయకుడు తనపై దాడికి పాల్పడినట్లు సర్పంచ్ రాయిపల్లి లోవరాజుకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనకు గాయాలు కావడంతో తుని ఆసుపత్రిలో చికిత్స పొంది ఫిర్యాదు చేశారన్నారు. సర్పంచ్ తెలిపిన వివరాలు, ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని కోటనందూరు ఎస్.ఐ పంచాడ స్వామినాయుడు విలేకరులకు తెలిపారు.

నారుమళ్లకు ముందు విత్తన శుద్ధి అవసరం

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

విత్తనాలు వేసేటప్పుడు విత్తన శుద్ధి చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి రెడ్ల శ్రీరామ్ రైతులకు సూచించారు. మండలంలోని గుర్రంపాలెం పరిధిలో శుక్రవారం రైతు భరోసా కేంద్రంలో జరిగిన అగ్రి అడ్వైజర్ బోర్డు సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు వరితోపాటు రాగులు, కొర్రలు వెయ్యాలన్నారు. ప్రతి ఆర్‌బికెలో వరి విత్తనాలు యూరియా, పొటాస్, డిఎపి అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. రైతులు పొలం గట్లపై కందులు జల్లుకుంటే అవి పూర్తిగా ఉచితంగా రైతు భరోసా కేంద్రాల్లో ఇస్తామన్నారు. రైతులందరూ వెదజల్లే పద్ధతిని పాటించాలని, దీనిద్వారా పెట్టుబడి తగ్గడంతోపాటు దిగుబడి పెరుగుతుందని రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మైనార్టీల అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-కోటనందూరు

జిల్లాలో మైనార్టీల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా వర్క్ బోర్డు వైస్ చైర్మన్ షేక్ ఖాజా అన్నారు. శుక్రవారం ఆయన కోటనందూరులోని మసీదును సందర్శించారు. మైనార్టీ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉన్న మసీదులన్నీ సందర్శించి వాటి స్థితిగతులను పరిశీలించి రోడ్లు భవనాల శాఖామంత్రి దాడిశెట్టి రాజా దృష్టికి తీసుకుని వెళ్లి ఆయన సహకారంతో మసీదుల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ముస్లిం సోదరులు ఉన్న ప్రతి చోట మసీదుల్లేని ఏరియాలో నూతన మసీదుల నిర్మాణానికి, మసీదులకు మరమ్మతులు నిర్వహించడానికి కృషి చేస్తానన్నారు. షేక్ మీరాబాయి మాట్లాడుతూ మసీదులో మౌలిక వసతులు కల్పించాలని, ముస్లిములకు శ్మశాన వాటికి నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి లగుడు శ్రీనివాస్, మండల కో ఆప్షన్ సభ్యులు జగటాలకోట సత్తిబాబు, ఎస్.రాంబాబు గరిసింగు దొరబాబు, ఎండి ఆదం ఖాన్ పాల్గొన్నారు.

కలెక్టర్ ఆదేశాలతో రేషన్ డేటా మార్పు

ప్రజాశక్తి - తాళ్లరేవు

ఒక కుటుంబంలో ఇద్దరు చిన్నారులు రేషన్ కార్డులో లేనట్టు నమోదవడంతో నాలుగేళ్లుగా ఆ కుటుంబంలోని చిన్నారులకు ఎటువంటి సౌకర్యాలూ అందడం లేదు. ఆ కుటుంబం కలెక్టర్‌ను కలవడంతో ఆ కుటుంబానికి ఊరట లభించింది. తాళ్లరేవు గ్రామానికి చెందిన రక్షవారి పేట నివాసి ఓలేటి లక్ష్మి కుటుంబానికి చెందిన రేషన్ కార్డులో పిల్లల డేటా లేదు. నాలుగేళ్లుగా ప్రభుత్వ దుకాణాల ద్వారా రేషన్ పొందేందుకు అనర్హులుగా గుర్తించారు. ఆమె కుటుంబ సభ్యులు కలెక్టర్‌ను ఆశ్రయించడంతో ఆమె ప్రత్యేక శ్రద్ధ తీసుకుని తహశీల్దారు పోతురాజును సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. తక్షణ చర్యల్లో భాగంగా సంబంధిత వాలంటీర్ ద్వారా అనారోగ్యంతో కాకినాడలో చికిత్స పొందుతున్న ఓలేటి లక్ష్మి బయోమెట్రిక్‌ను తీసుకుని అప్‌లోడ్ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. వాలంటీర్‌ను స్థానిక వైసిపి నాయకులు కుడుపూడి మల్లేశ్వరరావు కాకినాడ తీసుకువెళ్లి బయోమెట్రిక్ అప్లోడ్ చేయించారు. దీంతో ఆమెకు రేషన్ కార్డుతో పాటు ఆరోగ్యశ్రీ కార్డు లభించనుంది.

వాలంటీర్లకు నియామక పత్రాలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

ఇటీవల ఖాళీ అయిన వాలంటీర్ల స్థానంలో నూతన వాలంటీర్లను నియమించి వారికి ఎంపీపీ రాయుడు సునీత నియామక పత్రాలు అందజేశారు. నూతనంగా నియమితులైన వాలంటీర్లు బాధ్యతాయుతంగా పని చేయాలని ఎంపిపి సునీత అన్నారు. ఈ సందర్భంగా గాడిమొగ జి.వేమవరం, చొల్లంగి గ్రామాల్లో వాలంటీర్లను నియమిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల ప్రధాన కార్యదర్శి రాయుడు గంగాధర్, మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్ మోహనకష్ణ పాల్గొన్నారు.


యానాం వార్తలు

నేడు డాక్టర్ శిఖామణికి పురస్కారం



ప్రజాశక్తి - యానాం

యానాంకు చెందిన ప్రముఖ కవి, విమర్శకుడు, కవిసంధ్య సంపాదకుడు డాక్టర్ శిఖామణి ఒంగోలుకు చెందిన మధురకవి మల్లవరపు జాన్-2021 పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ మేరకు మల్లవరపు జాన్ మధుర సాహిత్య భారతి నిర్వాహకులు డాక్టర్ నూకతోటి రవికుమార్, మల్లవరపు ప్రభాకరావు సమాచారం ఇచ్చారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో శిఖామణికి అవార్డు ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు అభినందనలు తెలియజేశారు.




నిరసన తెలియజేస్తున్న కో-ఆపరేటివ్ స్టోర్స్ లిమిటెడ్ సిబ్బంది

డిమాండ్లు నెరవేర్చకపోతే దీక్ష

ప్రజాశక్తి - యానాం

యానాం కో-ఆపరేటివ్ స్టోర్స్ లిమిటెడ్ సిబ్బందికి 33 నెలల బకాయి జీతాలు, ఇపిఎఫ్ అంశాలతో కూడిన సుమారు పది డిమాండ్లు నెరవేర్చకపోతే నిరాహార దీక్ష చేపడతామని యూనియన్ ప్రెసిడెంట్ పువ్వల శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ప్రాంతీయ పరిపాలన అధికారి కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఇపిఎఫ్ పెన్షన్ దరఖాస్తు చేయడానికి అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. అధికారులు తక్షణమే స్పందించి తమ డిమాండ్లు నెరవేర్చాలని, లేకుంటే మంగళవారం నిరాహార దీక్షకు పూనుకుంటామన్నారు.



చెక్కులు పంపిణీ చేస్తున్న ఆర్ఎఒ

బ్యాంకు రుణాలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - యానాం

ప్రభుత్వ, ప్రైవేట్ రంగ బ్యాంకులు అందించే ఎడ్యుకేషన్, వాహనాలు, ఇంటి, ఎంఎస్ఎంఇ రుణాలను సద్వినియోగం చేసుకుని ప్రజలు ఆర్థికంగా ఎదుగాలని ఇండియన్ బ్యాంక్ జోనల్ మేనేజర్ సిహెచ్.వెంకట రమణారావు అన్నారు. శుక్రవారం పుదుచ్చేరివ్యాప్తంగా రుణ వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక గాజుల గార్డెన్, పార్వతీశ్వరమ్మ మినీ గార్డెన్స్‌లో ఇండియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆర్ఎఒ మునిస్వామి, ఇన్చార్జి మున్సిపల్ కమిషనర్ ఖండవల్లి రామకష్ణ పాల్గొని వివిధ బ్యాంకుల్లో సుమారు 7.52 కోట్లు రుణాలు పొందిన 54 మంది బ్యాంక్ వినియోగదారులకు చెక్కులు పంపిణీ చేశారు.



సాయం అందజేస్తున్న కొత్తపేట మండల యువశెట్టిబలిజ సంఘం

అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి సాయం

ప్రజాశక్తి-కొత్తపేట

ఇటీవల అగ్ని ప్రమాదంలో గర్వం కోల్పోయిన రావులపాలెం మండలం దేవరపల్లి గ్రామం మట్టలదొడ్డికి చెందిన విత్తనాల వీరభద్రానికి చెందిన ఇల్లు అగ్నికి ఆహుతై ఆస్తి నష్టం సంభవించింది. అగ్నిప్రమాదంలో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆ కుటుంబానికి కొత్తపేట మండల యువ శెట్టి బలిజ సంఘం వారు బాధిత కుటుంబానికి రూ.15వేల సాయం శుక్రవారం అందించారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు బొక్కా ప్రసాద్, గౌరవ అధ్యక్షులు యనమదల శ్రీనివాస్, సెక్రెటరీ శీలం కొండబాబు శెట్టి, ఖండ్రిగ ఉప సర్పంచ్ కడలి పార్థసారథి,ఆర్గనైజింగ్ సెక్రెటరీ ముషిని వెంకటరమణ, జాయింట్ సెక్రెటరీ కడలి భీమా, కుడిపూడి గణపతి, తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తిగా వెలగతోడు పశు వైద్యశాల

ప్రజాశక్తి-మండపేట




నిర్మాణంపూర్తికాని నూతనపశువైద్యశాల భవనం

వెలగ తోడులో గ్రామీణ పశు వైద్యశాల శిథిలావస్థకు చేరుకున్న నేపథ్యంలో ఆ భవనం చెంతనే అగ్రికల్చర్ మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో నాబార్డ్ నిధులు రూ.26.5 లక్షలతో 2021 సంవత్సరంలో నూతన భవన నిర్మాణ పనులు చేపట్టారు. రెండేళ్లగా ఈ భవన నిర్మాణ పనులు పూర్తి కాకపోవడంతో పశుపోషకులకు, సిబ్బందికి అవస్థలు తప్పడం లేదు. నేటికీ 75 శాతం పనులు పూర్తిగా గాక మిగిలిన పనులు తలుపులు, కిటికీలు, మరుగుదొడ్డు, ఫ్లోరింగ్ తదితర నిర్మాణ పనులు చెయ్యాల్సివుంది. పాత భవనంలో వర్షపు నీరు కారుతుండటం కనీస సౌకర్యాలు లేకపోవడంతో పశువైద్యం కోసం వచ్చే పశు పోషకులు, సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నెల రోజుల్లోనే మిగిలిన భవన నిర్మాణ పనులు పూర్తి చేస్తామని అగ్రికల్చర్ మార్కెటింగ్ శాఖ డిఇ పి.వెంకటేశ్వరరావు చెప్పినప్పటికీ నేటికి పూర్తి కాలేదు. అధికారులు స్పందించి నిర్మాణ పనులు పూర్తి చేయాలని పశుపోషకులు, రైతులు కోరుతున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యల పరిష్కారానికి డిమాండ్

ప్రజాశక్తి-రామచంద్రపురం

ప్రభుత్వ పాఠశాలలో సమస్యలను పరిష్కరించాలని, గుర్తింపు లేకుండా నడుస్తున్న శ్రీ చైతన్య టెక్నో స్కూల్ రద్దు చేయాలని పిడిఎస్‌యు నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం పిడిఎస్‌యు నాయకులు, విద్యార్థులు ద్రాక్షారామలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. పిడిఎస్‌యు ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బి.సిద్ధూ మాట్లాడుతూ ప్రభుత్వ, కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలలు తెరిచి నాలుగు వారాలు కావస్తోందని నేటికి ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తిగా విద్యా కానుక కిట్లు రాక ఇబ్బందులు పడుతున్నారన్నారు. మరో పక్క కార్పొరేట్, ప్రైవేటు విద్యా సంస్థల్లో విద్యార్థుల తల్లిదండ్రులు నుంచి రూ.వేలు ఫీజులు వసూలు చేస్తున్నారని, విద్యా శాఖ అధికారులు ఫీజులు నియంత్రణ చట్టాలు అమల్లో విఫలమయ్యారని ఆరోపించారు కార్యక్రమంలో అరుణోదయ జిల్లా కార్యదర్శి వి.భీమా శంకరం, పివైఎల్ జిల్లా కార్యదర్శి ఎ.కృష్ణ, సిహెచ్.రాజా రెడ్డి, పిడిఎస్‌యు నాయకులు కె. సురేష్, సిరి చందన, వై.షిబా, చెల్లె శివ, అర్.జ్యోతి ,ప్రమీల, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రణాళిక పట్టిక అందజేస్తున్న అధికారులు

జగనన్న కాలనీలకు తాగనీరు సరఫరాకు ప్రణాళిక ఖరారు

ప్రజాశక్తి-కోటనందూరు

తుని మున్సిపాలిటీ రాజుపేటలో జగనన్న హౌసింగ్ కాలనీ ప్రజలకు తాగునీరు నీరు సరఫరా చేయడానికి రూ.ఐదు కోట్లతో ప్రణాళిక రూపొందించినట్లు రోడ్లు భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా తెలిపారు. ఎస్ఇ ఎం.శ్రీనివాస్, డిఇ ఎ.శివాజీ శుక్రవారం తునిలో మంత్రి రాజాకు అంచనా పట్టిక అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి రాజా మాట్లాడుతూ రాజుపేటలో జగనన్న గహ నిర్మాణ పథకం ద్వారా 4,770 మంది అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు ఇచ్చినట్లు తెలిపారు. వారందరికీ ఇంటింటి కొళాయి నిర్మాణం చేపట్టడానికి ప్రణాళిక రూపొందించామని, త్వరలోనే టెండర్ ప్రక్రియ పూర్తి చేస్తామని తెలిపారు. గతంలో ఎన్నడూ లేనంత విధంగా తుని పట్టణాన్ని అభివద్ధి చేసినట్లు తెలిపారు. నాలుగేళ్ల పాలనలో తుని పట్టణానికి అత్యధికంగా నిధులు కేటాయించి సిసి రోడ్లు, డ్రైనేజీలు మెరుగైన వసతులను ఏర్పాటు చేశామన్నారు. 40 ఏళ్ల నుంచి రైల్వే గేట్లతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలకు రైల్వే గేట్లు వద్ద బ్రిడ్జి నిర్మించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న కమిషనర్

ఓటుపై అవగాహన అవసరం

ప్రజాశక్తి-కాకినాడ కార్పొరేషన్

కాకినాడ నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న యువతను గుర్తించి వారికి ఓటు హక్కు పొందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కమిషనర్ రావురాల మహేష్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం కార్పొరేషన్ కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ఓటు రాని యువతను గుర్తించి వారికి ఓటు హక్కు కల్పించాలన్నారు. కాకినాడ పరిధిలో ఉన్న హిజ్రాలకు ఓటు హక్కు కల్పించాలని, కుటుంబంలో పది మంది కంటే ఎక్కువ ఉన్న కుటుంబాలకు వేరే డోర్ నెంబర్లను ఇవ్వాలని కమిషనర్ తెలిపారు. అధికారులు ఎంక్వయిరీ సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

డెంగీ నివారణకు పారిశుధ్య పనులు

ప్రజాశక్తి -కరప

మండలంలోని గ్రామాల్లో డెంగీ, అంటువ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య పనులు అన్ని పంచాయతీల పరిధిలో చేపట్టాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినట్లు పంచాయతీ విస్తరణాధికారి శ్రీనివాసరావు తెలిపారు. ఈ నెల 10వ తేదీ నుంచి 26 వరకు షెడ్యూల్ ప్రకారం ఆయా గ్రామ పంచాయతీల్లో పారిశుధ్య పనులు నిర్వర్తించాల్సి ఉందని శ్రీనివాసరావు తెలిపారు. వర్షాల కారణంగా నిల్వ నీరు ఉండే ప్రదేశంలో నీటిని తొలగించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. దోమల నివారణకు సాయంత్రం సమయంలో ఫాగింగ్ చేయాలన్నారు.

క్రీడాకారునికి ఘన సన్మానం

ప్రజాశక్తి-అన్నవరం

కరాటేలో గోల్డ్ మెడల్ సాధించిన క్రీడాకారుని సత్యదేవ లయన్స్ క్లబ్ ఆఫ్ అన్నవరం ఆధ్వర్యాన శనివారం ఘనంగా సత్కరించారు. స్థానిక క్లబ్ కార్యాలయంలో లైన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ పర్వత జానకి రాజబాబు ఆధ్వర్యంలో క్లబ్ సభ్యులు శంఖవరం గ్రామానికి చెందిన క్రీడాకారుడు మేడిశెట్టి వెంకటరమణను సన్మానించారు. గోల్డ్ మెడల్ సాధించిన క్రీడాకారునికి శిక్షణ ఇచ్చిన శృంగవరం గ్రామానికి చెందిన మాస్టర్ రామోజీ వెంకటేష్‌ను కూడా సత్కరించారు ఈ సందర్భంగా క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ జానకి రాజబాబు మాట్లాడుతూ క్రీడాకారులకు క్లబ్ తరపున సత్కరించడం వారిలో మరింత ఆత్మ ధైర్యం పెంపొంది మునుముందు మరిన్ని పతకాలు సాధించేందుకు దోహదపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు డొంకాట గిరి, పంచాది గుర్రాజు, సునీత, నానాజీ, అర్జున్ రావు పాల్గొన్నారు.

టవర్ నిర్మాణం ఆపాలని నిరసన

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

తమ గ్రామంలో నివాసాల మధ్యలో సెల్ టవర్ నిర్మాణం పనులు చేపట్టవద్దంటూ శుక్రవారం ఉండూరు గ్రామ సచివాలయం వద్ద గ్రామస్తులు నిరసన వ్యక్తం చేశారు. సెల్ టవర్ నిర్మాణ పనులు వెంటనే నిలుపుదల చేయాలని హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబుకు గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. గ్రామస్తులు మాట్లాడుతూ ఇళ్ల మధ్యలో సెల్ టవర్ నిర్మాణం వల్ల రేడియేషన్ ప్రభావంతో ఆ ప్రాంతంలోని ప్రజల ఆరోగ్యానికి ముప్పు ఏర్పడే ప్రమాదం ఉందని టవర్ నిర్మాణ పనులు నిలుపుదల చేయాలని కోరారు.

సచివాలయాలను త్వరితగతిన నిర్మించాలి

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలో అసంపూర్తిగా ఉన్న సచివాలయ భవన నిర్మాణాలను త్వరితగతిన నిర్మించాలని డిఎల్‌డిఒ పి.నారాయణమూర్తి అన్నారు. తాళ్లరేవు మండల పరిషత్‌లో ఎంపిడిఒ ఎం.అనుపమ అధ్యక్షతన సచివాల ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, కాంట్రాక్టర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎల్‌డిఒ నారాయణమూర్తి మాట్లాడారు. నిర్మాణాలకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులను త్వరలో చెల్లిస్తామని ఈ లోపుగా నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. 2019-20 రేట్ల ప్రకారం భవన నిర్మాణాలకు చెల్లిస్తామనడంతో భవన నిర్మాణాలకు 2023 రేట్లు వర్తింపజేయాలని కాంట్రాక్టర్లు డిమాండ్ చేశారు. పాత ధరల ప్రకారం బిల్లులు చెల్లించడం వల్ల రూ.లక్షలు నష్టపోతున్నామని కాంట్రాక్టర్లు తెలిపారు.

పారదర్శకంగా ఓటర్ల జాబితా రూపకల్పన

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

ఎలాంటి తప్పిదాలకు ఆస్కారం లేకుండా పూర్తి పారదర్శకంగా ఓటర్ల జాబితా రూపకల్పన చేయాలనికాకినాడ రూరల్ నియోజకవర్గ ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారి, ఆర్‌డిఒ ఎన్‌విఎ.సత్యనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం కాకినాడ రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో బూత్ స్థాయి అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈ నెల 21వ తేదీ నుంచి క్షేత్రస్థాయిలో ఓటర్ల జాబితా పరిశీలిస్తామన్నారు. ఈ నేపథ్యంలో బూత్ స్థాయి అధికారుల ఓటర్ల నమోదుకు సంబంధించి దరఖాస్తు ఫారాలైన ఫారం 6 ఫారం 7 ఫారం 8లపై ఓటర్ల మార్పులు చేర్పులు తొలగింపులు ప్రక్రియ ఎన్నికల కమిషన్ ఆదేశాలకు లోబడి నోటీసులు ఇచ్చి పరిశీలన చేయాలని సూచించారు. శతాధిక వయసు కలిగిన ఓటర్లు ఇతర ఓటర్లపై ప్రత్యేక దష్టి పెట్టాలని అన్నారు. ఈ విషయంలో ప్రణాళిక బద్ధంగా సమన్వయంతో పనిచేయాలన్నారు. దీన్ని దష్టిలో పెట్టుకుని ఎన్నికల సంఘం నియమనిబంధనలు తుచ తప్పకుండా పాటిస్తూ పక్కాగా ఓటర్ల జాబితా రూపకల్పన జరిగేలా అంకితభావంతో పనిచేయాలని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో రూరల్ తహసీల్దార్ వి.మురార్జీ, కరప తహశీల్దారు పొన్నమండ శ్రీనివాసరావు, డిటిలు కల్యాణ్, డివి చైనులు. తదితర సిబ్బంది పాల్గొన్నారు.

పరిశుభ్రమైన ఆహారాన్ని అందించాలి

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

పాఠశాలలో విద్యార్థులకు పరిశుభ్రమైన ఆహారాన్ని అందించాలని సర్పంచ్ పెయ్యల రాజ్ కుమార్ సూచించారు. భీమనపల్లి జెడ్పి ఉన్నత పాఠశాల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని శుక్రవారం సర్పంచ్ రాజ్ కుమార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వండిన ఆహారాన్ని ఆయన రుచి చూసి విద్యార్థులకు భోజనం వడ్డించి సంతృప్తిని వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఆయన వెంట హెచ్ ఎంఎస్.సత్యనారాయణ, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

అందుబాటులో యాంటీ స్నేక్ వీనమ్

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

కపిలేశ్వరపురంలో గొడవర్తి సత్యనారాయణ మూర్తి ఎల్‌వి.ప్రసాద్ కంటి ఆసుపత్రిలో పాము కాటుకు అందుబాటులో యాంటీ స్నేక్ వీనమ్ ఉందని యాజమాన్యం తెలిపింది. శుక్రవారం వారు మాట్లాడుతూ పాము కాటు కు గురైన వారికి అత్యవసర పరిస్థితుల్లో ఈ వ్యాక్సిన్ ఉచితంగా అందజేస్తామని తెలిపింది.

దస్తావేజు పోయినది

బేతపోతుల రామకృష్ణ తండ్రి : (లేటు) కృష్ణమూర్తి, డోర్ నెం.115-1-195/1, ఆఫీషియల్ కాలనీ, కోలమూరు, రాజమండ్రి రూరల్, తూర్పు గోదావరి జిల్లా, అను నేను ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా నాకు చెందిన ఒరిజినల్ అమ్మకపు దస్తావేజు నెం. 777/2018వ, తేది. 22-01-2018 గల, సదరు దస్తావేజును ఒక కవరులో పెట్టుకుని ది.06-07-2023 తేదీ నాడు బొమ్మూరు నుండి కోలమూరు వెళ్తుండగా మార్గమధ్యములో దస్తావేజు ఉన్న కవరు జారి పడిపోయినది. ఎంతవెదికినను దొరకలేదు. కావున ఎవరికైనా దొరికినచో పైన తెలిపిన చిరునామాకు అందచేయగలరు.

మహారాజశ్రీ 7వ అదనపు జిల్లా కోర్టు :: పెద్దాపురం

M.V.O.P.No. 191/2021

బిట్వీన్:
షేక్ బషీర్ ఉన్నీషా ...పిటీషనరు
అండ్
షేక్ గౌషియా బేగమ్ అండ్ అదర్స్ ...రెస్పాండెంట్స్

ఆర్-5: ఎస్.కె.బాషా, తండ్రి: తాతలు, డో.నెం. 1-18, బిల్లనందూరు గ్రామం, కోటనందూరు మండలం, కాకినాడ జిల్లా. (మోటార్ సైకిల్ యజమాని, రిజిష్టరు నెం. AP 31 CG 2270)

పై కేసులో 5వ రెస్పాండెంటు అయిన మీరు ఎన్ని పర్యాయములు సమన్లు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున మీ హాజరు నిమత్తం **ది.25-07-2023వ తేదీన వాయిదా అయి ఉన్నది. ఆరోజు ఉదయం గం॥ 10:30 ని॥లకు మీరు స్వయంగా గాని, ప్లీడరు ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలియజేయగలరు.** లేనిచో మీ పరోక్షముగా తీర్మానించబడునని తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

కె.వి.భద్రరావు
కె.శ్రీవాణి,
కె.ఎస్.చంద్రరావు
అడ్వకేట్స్, పెద్దాపురం.
సెల్: 94401 77063

In The Court Of The Hon'ble 4th Additional District Judge :: Kakinada

A.S.No. 56/2017

Between:
Ch.Sivaji ***...Petitioner /Appellant***
AND
K.Anandrao and Others ***...Respondents***

TO: R-3: Koripalla Sri Anand Bhargav, S/o. Ramakrishna, aged 23 years, Student, R/o. Hi Rise Paradise, 4th Floor, D-2, D.No. 88-01-25/14, Beside BVR Sree Function Hall, Nimmakayala Market Street, Morampudi Center, Rajamahendravaram.

పై నెంబరు అప్పీలు పిటీషనులో 3వ రెస్పాండెంటు అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపినను తీసుకొనక కాలయాపన చేయు చున్నారు. కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **ది.14-07-2023వ తేదీకి వాయిదా వేసినారు. ఆరోజు ఉదయం గం॥ 10:30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట మీరు **స్వయంగా గాని, మీ వకీలు ద్వారా గాని హాజరయ్యి మీయొక్క ఆక్షేపణలు తెలుపుకొనవలెను.** లేని ఎడల పై పిటీషను మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

కె.వి.ఎస్.వి.లక్షాజీరావు (వేణు)
అడ్వకేట్, కాకినాడ.
సెల్: 98662 11196

దస్తావేజులు పోయినవి

కాకినాడ జిల్లా, కాకినాడ అర్బన్ మండలం, కాకినాడ, రామసోమ యాజుల వీధి, డో.నెం.12-2-28/2రు కాపురస్తులు **కొమ్ము జోసెఫ్ @ మోసఫ్ గారి కుమారుడు కొమ్ము రాజ్‌కుమార్** గారు యావన్మందికీ తెలియ జేయునది ఏమనగా..,

నాయొక్క ఆస్థి (భూమి)కి సంబంధించి ది.04-08-1997 తేదీన బిక్కవోలు రిజిస్ట్రారు ఆఫీసులో రిజిష్టరు కాబడిన **దస్తావేజు నెం.1958/1997** మరియు ది.12-05-1993 తేదీన బిక్కవోలు రిజిస్ట్రారు ఆఫీసులో రిజిష్టరు కాబడిన **దస్తావేజు నెం. 1292/1993** లను తీసుకొని ది.29-06-2023వ తేదీన మా ఇంటి నుండి కాకినాడ రూరల్ మండలం, ఇంద్రపాలెం, పోస్టాఫీసు వీధిలో గల మా బంధువుల ఇంటికి వెళ్ళుచుండగా మార్గం మధ్యలో పడిపోయినవి. కావున ఎవరికైనా దొరికిన ఎడల ఈ క్రింది సెల్ నెంబరుకు గాని పైన తెలిపిన అడ్రసుకు గాని తెలియజేయగలరు.

కొమ్ము రాజ్ కుమార్
కాకినాడ. సెల్: 93901 34484

ప్రకటన

మహారాజశ్రీ తణుకు 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

F.D.I.A.No. 4/2023, in O.S.No. 409/2020

బిట్వీన్:
పచ్చిపులుసు వీరవెంకట సత్యనారాయణ ...పిటీషనరు /వాది
అండ్
ధనిశెట్టి మాధవి ...రెస్పాండెంటు /ప్రతివాది

రెస్పాండెంటు /ప్రతివాది:
ధనిశెట్టి మాధవి, భర్త: వీరభద్రరావు, డో.నెం.2-78, మెయిన్ రోడ్, డి.ఎల్.కె.రోడ్, మోర్త, ఉండ్రాజవరం మండలం.

ఈ నెంబరు ఫైనల్ డిక్రీ పిటీషనును, పిటీషనరు మీపై ప్రిలిమినరీ డిక్రీని బట్టి ఫైనల్ డిక్రీ పాస్ చేయమని పై కోర్టులో పిటీషను దాఖలు చేసియున్నారు. సదరు పిటీషనులో వాయిదా ది. 02-08-2023 అయి ఉన్నది. సదరు తేదీన అనగా **ది.02-08-2023 సం॥రం తేదీన మీరు సదరు కోర్టు వారి ఎదుట ఉదయం గం॥ 10:30 ని॥లకు స్వయంగా గాని, న్యాయవాది ద్వారా గాని హాజరు అయ్యి మీ ఆక్షేపణలు తెలియజేసుకోవలెను.** లేని ఎడల సదరు పిటీషను మీ పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

కె.ఎస్.సోమనాథరెడ్డి, అడ్వకేట్స్,
తణుకు. సెల్: 76599 84777

ఆయా పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

కాకినాడ కార్పొరేషన్ : కాకినాడ జిల్లాలో ఖాళీగా ఉన్న 28 ఆయా పోస్ట్ భర్తీలకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ కె.పమీల శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు సంబంధిత సిడిపిఒ కార్యాలయంలో ఖాళీలను గుర్తించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు ఈ నెల 17వ తేదీలోగా దరఖాస్తులను సిడిపిఒ కార్యాలయాల్లో అందజేయాలని పీడీ తెలిపారు.

ఆయుర్వేద మందు పంపిణీ

కాకినాడ రూరల్ : సర్పవరం జంక్షన్‌లో అలియన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆయుర్వేద వైద్యులు ఇంజనీర్ మూర్తి శుక్రవారం ఆయుర్వేద మందు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన ఇంటి పరిసరాల్లో ఆరోగ్యానికి మేలు చేసే అనేక రకాల ఔషధ మొక్కలు ఉంటాయని చెప్పారు. వాటి ద్వారా 60 రకాల వనమూలికలతో ఈ సర్వరోగ నివారిణి మందు తయారు చేసినట్లు తెలిపారు. వనమూలికలు, ఔషధ మొక్కలు ఆరోగ్యానికి మేలు చేయడంతో పాటు అనేక రకాల సౌందర్య ఉత్పత్తిలో వాటిని వినియోగిస్తారని అన్నారు. ఆయుర్వేద, హోమియోపతి మందులు కూడా వనమూలికలు ఔషధ మొక్కల నుంచి తయారవుతాయని మూర్తి తెలిపారు.

మహారాజశ్రీ ఆలమూరు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S. 206/2022

Between:
ఆనాల విజయకుమారి **-వాది**
AND
దూడల రజని, W/o. దానియేలు రాజు, 40 సం॥లు, నవాబుపేట గ్రామం, ఆలమూరు (మం), డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా. **-ప్రతివాది**

పై నెంబరు దావాను, వాది, పర్మినెంట్ ఇంజంక్షన్ నిమిత్తం దాఖలు చేయగా, ప్రతివాది దూడల రజని, W/o. దానియేలు రాజు అను మీకు ఎన్నిసార్లు సమన్లు పంపినను అమలు జరగనందున పై దావా **31-08-2023 నకు వాయిదా యున్నందున సదరు దినమున ఉదయం 10.30 గం॥లకు** శ్రీయుత కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హాజరయి మీకు ఏమైనా అభ్యంతరములు ఉన్న యెడల శ్రీయుత కోర్టు వారికి తెలియజేసుకొనవలెను. లేని యెడల సదరు దావా మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం)

కె.భీమశంకరరావు
వాది తరపు అడ్వకేటు
ఆలమూరు ఆలమూరు - 533233
08-07-2023 సెల్: 9959679470

మహారాజశ్రీ ఆలమూరు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S. 36/2020

Between:
కట్టా లక్ష్మి **-వాది**
AND
వనుం శ్రీనివాస్, S/o. సుబ్బారావు, 50 సం॥లు, పోలీస్ కానిస్టేబుల్, డో.నెం. 12-276, వేమగిరి తోట, కడియం (మండలం), రాజమండ్రి DMC. **-ప్రతివాది**

పై నెంబరు దావాను, వాది ప్రోనోటు బాకీ వసూలు నిమిత్తం దాఖలు చేయగా, ప్రతివాది అయిన వనుం శ్రీనివాస్, S/o. సుబ్బారావు అను మీకు ఎన్నిసార్లు సమన్లు పంపినను అమలు జరగనందున పై దావా **ది. 04-08-2023 సం॥ తేదీన వాయిదా ఉన్నందున సదరు దినమున ఉదయం 10.30 గంటలకు** శ్రీయుత కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హాజరయి మీకు ఏమైనా అభ్యంతరములు ఉన్న యెడల శ్రీయుత కోర్టు వారికి తెలియజేసుకొనవలెను. లేనియెడల సదరు దావ మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం)

కె.భీమశంకరరావు
వాది తరపు అడ్వకేటు
ఆలమూరు ఆలమూరు - 533233
08-07-2023 సెల్: 9959679470

మహారాజశ్రీ 2వ అదనపు జిల్లా జడ్జి అమలాపురం వారి కోర్టులో

I.A.No. 1004/2019
A.S.S.R.No. 3356/2019

బిట్వీన్:
అరిగెల స్వామి నాయుడు (డైడ్) వగైరాలు/
అరిగెల సత్యవతి వగైరాలు
...పిటీషనర్లు /అప్పిలెంట్లు
మరియు
అరిగెల కేశవరామమూర్తి (డైడ్)/
అరిగెల సత్యవతి వగైరాలు
...రెస్పాండెంట్లు /రెస్పాండెంట్లు

నోటీసు ప్రకటన

టు:

(6) దున్నాల వెంకటేశ్వరరావు, తండ్రి: వి.వి.సత్యనారాయణరాజు, కల్వకొలను వీధి, అమలాపురం.

(13) సుందరనీడి సత్యానందరావు, తండ్రి: లేటు రెడ్డినాయుడు, రిటైర్ట్ ఉద్యోగి, వాడపల్లి పోస్టు, దామచర్ల మండలం, నల్గొండ జిల్లా, తెలంగాణ రాష్ట్రం.

(16) వరికూటి లక్ష్మి మంగతాయారు, భర్త: త్రినాథ్‌రావు, కాకినాడ పట్టణ రైల్వే స్టేషను ఎదురుగా, శ్రీరామ నగర్ రైల్వే క్వార్టర్స్, కాకినాడ.

(17) సంకు జ్యోతి, భర్త: దానపరమేశ్వరరావు, R/o. 3-4-2, గుడివాడ అప్పన్న కాలనీ, బి.ఎ.పి.పోస్టు, గాజువాక మండలం, విశాఖపట్నం-12.

(18) కొమ్మిశెటి లత, భర్త: నాగేంద్ర, డో.నెం.6-1-2, వాడ్రేవు వారి వీధి, శ్యామల ధియేటర్ వద్ద, టి.నగర్ కాలనీ, రాజమండ్రి.

ది.07-03-2019 సం॥రం తేదీన సీనియర్ సివిల్ జడ్జి కోర్టు వారు అమలపురం ఇచ్చిన ఓ.ఎస్.నెం.77/2004 దావా డిక్రీ జడ్జిమెంటు Set Aside / రద్దు చేయమని కోరుచూ అప్పీలు దాఖలు చేయుటలో ఆలస్యమును క్షమించి, అప్పీలు రిజిష్టరు చేయవలసినదిగా పిటీషను ఐ.ఎ.నెం.1004/2019 ఆర్డరు 40 Rw A సి.పి.సి. క్రింద పిటీషనుతో అప్పీలు పిటీషనర్లు దాఖలు చేసినారు. సదరు పిటీషను రెస్పాండెంట్లు 6, 13, 16, 17, 18 హాజరు నిమత్తం ది. 13-07-2023 సం॥రం తేదీ వాయిదా అయి ఉన్నది. సదరు రెస్పాండెంట్లు 6, 13, 16, 17, 18 **ది.13-07-2023 సం॥రం తేదీన ఉదయం గం॥ 10:30 ని॥లకు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని పైన తెలిపిన వారి కోర్టులో హాజరు అయ్యి ఆక్షేపణలున్న ఎడల తెలియ పరచుకొనవలెను.**

శ్రీ నల్లా ప్రభాకర్
శ్రీమతి నల్లా లక్ష్మీగురుకుమారి
పిటీషనరు తరుపు న్యాయవాదులు
అమలాపురం, అమలాపురం.
6-7-23. సెల్: 94911 90659